ఉపాధి పనుల జాతర ప్రారంభం


సిరికొండలో పశువుల పాక నిర్మాణపనులు ప్రారంభిస్తున్న డీపీవో మదన్‌మోహన్


కోనాపూర్‌లో గొర్రెల షెడ్డుకు మార్కింగ్ చేస్తున్న ఎంపీడీవో

మెట్‌పల్లి రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో చేపడుతున్న పనులను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్,మెట్‌పల్లి మండల పశువైద్యాధికారి కొమ్మెర మనీషా అన్నారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో మేకల షెడ్డు ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కథలాపూర్: కథలాపూర్ మండలం సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిధులతో చేపట్టే పనులను జిల్లా పంచాయతీ అధికారి మదన్మోహన్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, టీఏలు శ్రీధర్, అంబాజీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో 2025 సంవత్సరం ఉపాధిహామీ పనుల జాతర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంకుడు గుంతలు, గొర్రెల షెడ్లు, పశువుల షెడ్లకు ఆయా మండలాల అధికారులు మార్కింగ్ ఇచ్చి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీవోలు చౌదారపు గంగాధర్, భీమేష్, అధికారులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండలంలోని సిరిపూర్‌లో ఉపాధిహామీ పనుల జాతర పనులకు ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమాలలో మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, మాజీ ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : ఉపాధి హామీ పథకాలను గ్రామాలలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ఎండీ సలీమ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్దండి గ్రామంలో పనుల జాతరలో పశువుల పాకను ప్రారంభించి, భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో కోమరయ్య, టెక్నికల్ అసిస్టెంట్ వినోద్, రైతులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని నమిలికొండ లో ఎంపీడీవో స్వరూప రెడ్డి పనుల జాతరలో భాగంగా గ్రామసభ నిర్వహించి, నాడెపు కాంపోస్టు పనులకు ముగ్గు పోసి ప్రారంభించారు. కార్యక్రమంలో, ఏపీవో టి ఏ సెక్రటరీ ఫీల్డ్ అసిస్టెంట్, ఇందిరమ్మ కమిటీ మెంబర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో అధికారులు పనుల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీలో నిర్మించిన అభివృద్ధి పనులు ప్రారంభించి, నిర్మాణం పూర్తయిన వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంతోశ్, ఎంపీడీవో రాంరెడ్డి, సురేశ్‌రెడ్డి, డీఆర్డీవో ప్రత్యేకాధికారి వేణు, అధికారులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో వెల్‌కమ్ పార్టీ హంగామా

మల్లాపూర్: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో శుక్రవారం ప్రథమ సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన వెల్‌కమ్ పార్టీ వేడుకలు అలరించాయి. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను సాధించేందుకు తీవ్రంగా శ్రమించాలని ప్రిన్సిపాల్ భూమేశ్ పేర్కొన్నారు. చదువుల్లోనే కాకుండా ఆటపాటల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేసిన నత్యాలు, నాటికలు, గేమ్ షోలు, మిమిక్రీ, అభినయ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ భూమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సంగెంలో మొరం గుట్టకు టెండర్..!?

- రూ. 20 లక్షలకు ఖరారు
- రెవెన్యూ..మైనింగ్ ప్రేక్షక పాత్ర

కోరుట్లరూరల్: కోరుట్ల మండలంలోని సంగెం సమీపంలో ప్రభుత్వ సర్వే నంబరు 270 పరిధిలో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మొరం గుట్టకు గుట్టుచప్పుడు కాకుండా టెండర్ వేసినట్లు సమాచారం. వారం రోజుల నుంచి స్థానిక పెద్ద మనుషులు కొందరు ఈ విషయంలో మంతనాలు జరిపినట్లు సమాచారం. చివరికి ఓ వ్యక్తికి రూ.20 లక్షలకు మొరం తరలించేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే ఊరిలో అభివృద్ధి పనుల కోసం అని తేల్చిచెపుతున్నట్లు సమాచారం. అభివృద్ధి పనుల కోసం రూ. కోటి విలువ చేసే ప్రభుత్వానికి చెందిన మొరం గుట్టకు టెండర్ వేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం మైనింగ్, రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్ కృష్ణచైతన్యను వివరణ కోరగా.. మొరం గుట్టకు టెండర్ వేసిన విషయం తమ దృష్టికి రాలేదని, చట్టవిరుద్ధంగా ఎవరైనా టెండర్ వేస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు.


సంగెంలోని మొరం గుట్ట

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

మల్యాల: అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. పనుల జాతర-2025 కార్యక్రమంలో భాగంగా మల్యాల మండలంలోని గొర్రెగుండం గ్రామంలో జీపీ భవనం, రాంపూర్ గ్రామంలో అంగన్‌వాడీ భవనాలను శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ మల్లేశ్వరీ, నాయకులు పాల్గొన్నారు.

ఏఎస్సైకి ఎమ్మెల్యే అభినందన

మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ, ఇండియన్ పోలీస్ మెడల్ సాధించిన ఏఎస్సై రుద్రకృష్ణను చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు.

కొడిమ్యాల: మండలంలోని చెప్యాల, అప్పారావుపేటలో పలు అభివృద్ధి పనులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. పల్లెలు అభివృద్ధి చెందుతేనే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పనుల జాతరలో భాగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరి నారాయణ, నాయకులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

వివాహిత అదృశ్యం

కొడిమ్యాల: నాచుపల్లి గ్రామానికి చెందిన కోలకాని మౌనిక ఆచూకీ లభించడం లేదు. ఈగ శేఖర్ కు ముగ్గురు కూతుర్లు కాగా పెద్ద కూతురును నాచుపల్లి గ్రామానికి చెందిన కోలకాని మహేందర్‌కు ఇచ్చి ఈ నెల 14వ తేదీన సాంప్రదాయంగా పెళ్లి చేశారు. ఇటీవల అత్తగారింటి నుంచి పుట్టింటికీ వచ్చిన మౌనిక షాపింగ్ అని వెళ్లి సాయంత్రం గడిచిన ఇంటికి రాకపోవడంతో, కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తకపోవడంతో, ఈగ శేఖర్ తన కూతురు అయిన మౌనిక కనిపించట్లేదని స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సందీప్ పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

జగిత్యాలరూరల్: పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద సైకిల్‌పై వెళ్తున్న వృద్ధుడికి బస్సు ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల అంగడిబజార్‌కు చెందిన బోగ రాజబోను సైకిల్‌పై వెళ్తుండగా జగిత్యాల డిపో డ్రైవర్ పోడేటి తిరుపతి అజాగ్రత్తగా బస్సు నడిపి ఢీకొన్నాడు. రాజబోనుకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుమార్తె చౌటపల్లి వాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై కుమారస్వామి తెలిపారు.

కోటి నవదుర్గ ఆలయ కమిటీ చైర్మన్‌గా ధనుంజయ్

కోరుట్ల: కోరుట్ల పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోని కోటి నవదుర్గ దేవాలయ చైర్మన్‌గా జిల్లా ధనుంజయ్ ఎన్నికైనట్లు పద్మశాలీ కులోన్నతి సంఘం అధ్యక్షుడు గుంటుక ప్రసాద్ తెలిపారు. ఆలయ కమిటీ డైరెక్టర్లుగా అందే రాజేంద్ర ప్రసాద్, ఆడేపు నరేష్, కటుకం రవికుమార్, అందే సురేశ్, రుద్ర సురేష్‌లను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలీ కులోన్నతి సంఘం ప్రధాన కార్యదర్శి బండ్ల రవికుమార్, ఉపాధ్యక్షులు వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని బాధితుల ధర్నా

గొల్లపల్లి: ఇరవై రోజుల క్రితం తమపై దాడిచేసిన వారిని ఇంకా అరెస్ట్ చేయకపోవడంతో బాధితులు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట జగిత్యాల-ధర్మారం రహదారిపై ధర్నా చేపట్టారు. బాధితుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని నలగుట్ట ప్రాంతానికి చెందిన దండ్ల శ్రీనివాస్‌పై అదే ప్రాంతానికి చెందిన ఐదుగురు 20 రోజుల క్రితం దాడికి పాల్పడ్డారు. ఇది జరిగిన నాలుగు రోజులకు అరెస్ట్ చేయకపోవడంతో బాధిత కుటుంబాలు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టాయి. దీంతో బాధిత కుటుంబ సభ్యులను సముదాయించిన న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. వారి మాటలు విని బాధితులు శాంతించారు. కాగా 20 రోజులు అయినా ఐదుగురిని అరెస్ట్ చేయకపోవడంతో శుక్రవారం బాధితుడు శ్రీనివాస్, అతడి భార్య అంజలి, కుటుంబ సభ్యులు, బంధువులు న్యాయం కోసం ఆందోళనకు పూనుకున్నారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. బాధిత కుటుంబ సభ్యులను పోలీసులు స్టేషన్‌లోనికి తరలించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు బాధితుల మధ్య వాగ్వాదం జరిగింది. ధర్మపురి సీఐ పరిస్థితిని అదుపుచేసి రెండు రోజుల్లో అరెస్ట్‌చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. అలాగే దాడి చేసినవారిని అరెస్టు చేయాలని బాధితులు శుక్రవారం సాయంత్రం ఎస్పీ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.


రోడ్డుపై ధర్నా చేస్తున్న బాధితులు

ఎనీమియా ముక్త్ భారత్ ఐఎంఏ లక్ష్యం

జగిత్యాలరూరల్: ఎనీమియా ముక్త్ భారత్ ఐఎంఏ లక్ష్యమని జగిత్యాల ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు జగిత్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తహీనత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పుడూ వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు డిక్షనరీలు అందించడం జరిగిందన్నారు. ఈ కర్యాక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ సుధీర్, వైద్యులు నాగరాజు, కనకదుర్గ, హెచ్‌ఎం సింగు సత్తయ్య, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో ఐఎంఏ వైద్యులు

పారిశుధ్య నిర్వహణలో మున్సిపాలిటీ విఫలం

జగిత్యాల: పారిశుధ్య నిర్వహణలో జగిత్యాల మున్సిపాలిటీ విఫలమైందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత అన్నారు. జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లి వార్డులో పర్యటించి మాట్లాడారు. వార్డుల్లో డ్రెయినేజీలు తీయక, ఇంటింటి చెత్త సేకరణ జరుగగా మున్సిపాలిటీని మురికి చెత్తలా మారిందన్నారు. వాగు పక్కనే నీళ్ల బావి ఉండటంతో మంచినీళ్లు కలుషితమై చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని, ఇదే వాగులో చికెన్ వ్యర్థాలు సైతం వేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె వెంట నాయకులు గంగాధర్, ప్రతాప్, శ్రీను ఉన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీ కల్యాణ రామచంద్రస్వామి దేవస్థానంలో విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో చివరి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు కుంభార్‌కార్ అరుణ్, విశ్వహిందూ పరిషత్ గౌరవ అధ్యక్షుడే సత్యనారాయణ, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు

ఆరవెల్లి నాయకురాలు వద్ద భక్తుల సందడి

పెగడపల్లి: మండలంలోని ఆరవెల్లి నాయకురాలు ఆలయం వద్ద శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పే అండ్ అకౌంట్స్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలైన పెండింగ్ బిల్లులు, డీఏలు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు, ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి శ్రీనివాస్, మామిడి రమేశ్, సాహెద్‌బాబు, రవీందర్, మధుకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రామసభ తీర్మానం లేకుండా నిధులు ఇవ్వడం సరికాదు

రాయికల్: మండలంలోని ఎస్సీ సబ్‌ప్లాన్ ఉపాధి నిధులు గ్రామంలో ఎలాంటి తీర్మానం లేకుండా ఇతర వ్యక్తులకు అప్పగించడం సరికాదని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవో చిరంజీవికి వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ఉపాధి నిధులు గ్రామసభ తీర్మానం లేకుండా ఇష్టాను రీతిలో ఇతర వ్యక్తులకు అప్పగించడం సరైనది కాదని, గ్రామసభ తీర్మానం తర్వాతే పనులు అప్పగించేలా స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, మహేందర్‌గౌడ్, తలారి రాజేశ్, వెంకటేశ్, సాగర్, పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ విద్యను బలోపేతం చేయాలి

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న ప్రీ స్కూల్ విద్యను బలోపేతం చేయాలని డీడబ్ల్యూవో నరేశ్ అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మండలంలోని లింగాపూర్‌లో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను మల్యాల సీడీపీవో వీరలక్ష్మితో కలిసి శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. లబ్ధిదారుల ముఖ చిత్రీకరణ చేయకుండగా పౌష్టికాహారం పంపిణీ చేయొద్దన్నారు. సూపర్‌వైజర్లు మహేశ్వరి, పవిత్ర, సుభద్ర పాల్గొన్నారు.

పెన్షన్ దారుల మహా గర్జనను విజయవంతం చేయాలి

మల్యాల: సెప్టెంబర్ 9న, హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న వికలాంగులు, చేయూత పెన్షన్ దారుల మహా గర్జనను ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఎంఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంఎస్పీ జిల్లా ఆధికార ప్రతినిధి మండల ఇన్‌చార్జి బెజ్జంకి సతీష్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీస్, అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో కొమ్ము శేఖర్ మాదిగ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నప్పటికి ఫించన్‌దారులకు ఇచ్చిన హామీలను నేరవేర్చడం లేదన్నారు.సమావేశంలో నాయకులు ముప్పారపు రామస్వామి, గుడిసె రవి, మల్యాల ఈశ్వర్, బొల్లి కిషన్, నక్క రాజయ్య, దేవయ్య,తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్‌లో మార్వాడీ గోబ్యాక్ నిరసన

కథలాపూర్: వివిధ వస్తువులు విక్రయించే దుకాణాల యజమానులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మార్వాడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. వ్యాపారులు ర్యాలీగా వెళ్లి దుకాణాలను బంద్ చేయించారు. పోలీసులు వచ్చి రోడ్డుపై ఆందోళన చేపట్టవద్దని సూచించడంతో వారు తమ నిరసనను విరమించారు.

గణేశ్ మండపాల వద్ద సీసీ కెమెరాలు పెట్టించాలి

ఇబ్రహీంపట్నం: గణేశ్ మండపాల వద్ద తప్పనిసరిగా నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని గ్రామాలకు చెందిన గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా అవాంచనీయ సంఘటనలు జరుగకుండా భక్తి శ్రద్దలతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో ఎండీ సలీమ్, ఎస్సై అనిల్, ట్రాన్స్‌కో ఏఈ సతీష్, నిర్వాహకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సనాతన ధర్మాన్ని కాపాడటం అందరి బాధ్యత

కోరుట్ల: సనాతన ధర్మాన్ని కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని గర్రెపల్లి మహేశ్వర్ శర్మ అన్నారు. పట్టణంలో శుక్రవారం అన్నపూర్ణ అమావాస్య అన్న ప్రసాద సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గోపూజ, అన్నపూర్ణా దేవి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో అన్నప్రసాద సేవా చేర్మెన్ వనపర్తి చంద్రమోహన్, సనాతన ధర్మ ప్రచార సమితీ చైర్మన్, కార్యదర్శి మంచాల జగన్, బట్టు హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సన్మానం

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామంలో 100 రోజులు పూర్తి చేసుకున్న ఉపాధిహామీ కూలీలకు సన్మానం చేశారు. కార్యదర్శి మహేశ్, నాయకులు బెజ్జంకి మోహన్, హరీశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

సారంగాపూర్: సీపీఎస్ రద్దు కోసంసెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో చేపట్టే మహాధర్నా కార్యక్రమానికి ప్రతీ ఉపాధ్యాయుడు తరలిరావాలని పీఆర్‌టీయూ టీఎస్ సంఘ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో చేపట్టే మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొలిచాల సత్యరాజ్, నర్సింహమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మకంటి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

317 జీవో ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

మల్యాల: రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సంఘం సభ్యత్వాలు చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు హరికృష్ణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో రక్తదాన శిబిరం

కోరుట్ల: పట్టణంలో ప్రజాహిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజయోగిని దాది ప్రకాష్ మణి పుణ్యతిథి సందర్భంగా స్థానిక అరుణోదయ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అనిల్, రైల్వే వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పడాల నారాయణ, పోతని ప్రవీణ్ కుమార్, పాల్గొన్నారు.

దోనూర్‌లో వరద పాశం

ధర్మపురి: వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ మండలంలోని దోనూర్ గ్రామంలోని పెద్దగుట్ట స్వయంభు ఉగ్ర నృసింహస్వామికి వరుద పాశంతో నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు డప్పుల చప్పుళ్లతో తరలివెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీకాంతం, నాయకులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన టిప్పర్

కథలాపూర్: మండలంలోని తాండ్యాలలో బేసిమెంట్ రాయిని తరలిస్తున్న టిప్పర్ వాహనం శుక్రవారం అదుపుతప్పి మురికికాలువలో ఇరుక్కుపోయింది. గ్రామంలో ఇరుకుగా రోడ్డు ఉందని, భారీ వాహనాలు స్పీడ్‌గా వెళ్లడంతో అదుపు తప్పుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఏలాంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. మురికికాలువలో ఇరుక్కుపోయిన టిప్పర్‌ను అక్కడి నుంచి తీసేయడంతో రాకపోకలకు ఇబ్బందులు తీరాయని స్థానికులు తెలిపారు.

ఏఎస్సైగా పదోన్నతి

కోరుట్ల: కోరుట్లలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాజశ్రీ ఏఎస్సైగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆమెకు ఏఎస్సై స్టార్ అందించి అభినందించారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా సాంబారి కళావతి

జగిత్యాల: బీజేపీ జిల్లా కార్యదర్శిగా సాంబారి కళావతిని నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు చెందిన కళావతి ఇటీవల మహిళ మోర్చా జిల్లా కార్యదర్శిగా సైతం బాధ్యతలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నన్ను ఎంతో నమ్మకంతో కార్యదర్శిగా నియమించిన ఎంపీ అర్వింద్, మాజీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబుకు ధన్యవాదాలు తెలిపారు.

మొరం అక్రమ రవాణా అరికట్టాలని ఆర్డీవోకు వినతి

మెట్‌పల్లి: మొరం అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు జెట్టి లింగం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణానికి సమీపంలో ఉన్న గుండు గుట్ట నుంచి కొన్ని రోజులుగా అక్రమంగా మొరాన్ని తరలిస్తున్నారని, దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం తెలిపారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ యామ రాజయ్య, ఎర్రాల హన్మాండ్లు తదితరులున్నారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు వండే భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం, అల్పాహారం అందించాలని వంట పాత్రలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి తెలిపారు. మండలకేంద్రంలోని ఓడ్డెర కాలనీ పాఠశాలలో ఎంపీడీవో సలీమ్, అమ్మక్కపేట ప్రాథమిక పాఠశాలలో ఏవో రాజ్‌కుమార్ భోజనాలను తనిఖీ చేశారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కోరారు. పలు అభివృద్ధి పనులను వివరించారు. నిధులు మంజూరయ్యేలా సహకరించాలని కోరారు.

వైభవంగా పోచమ్మతల్లి ఉత్సవాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని లోకమాత పోచమ్మతల్లి ఆలయంలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీచైర్‌పర్సన్‌వసంత, మున్సిపల్ మాజీ చైర్మన్లు జ్యోతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నారులతో సరస్వతి పూజలు చేయించి అ ఆ లు దిద్దించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, అంగన్‌వాడీ టీచర్ మహిళలు పాల్గొన్నారు.

షూ పంపిణీ

కోరుట్ల: పట్టణంలోని కాల్వగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు జోగన్‌పల్లి కృష్ణమోహన్‌రావు శుక్రవారం సుమారు 50 మంది ఆరో తరగతి విద్యార్థులకు రూ.15 వేలు విలువ చేసే బూట్లు, సాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అడ్డగట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న ఇళ్ల లబ్ధిదారులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గ్రామానికి చెందిన ఆరెపెల్లి సుమలత, తోకల లక్ష్మి, గడ్డం దివ్యకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, మొదటి విడుతగా ఒకొక్కరికి రూ. లక్ష వారి ఖాతాలో జమ కావడంతో సంతోషం వ్యకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, జువ్వాడి నర్సింగరావు, కృష్ణరావుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోనకంటి వెంకట్, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు రాధ, నాయకులు దొంతుల శివకుమార్, అనిల్, గంగారెడ్డి, రాజన్న, రమేష్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు


యజమానులను ఆదేశిస్తున్న అధికారులు

జగిత్యాల: ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించాలని, వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రోడ్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించాలని, లేనిపక్షంలో షాపులపై దాడులు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివేక్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

డివైడర్లు తొలగించాలని కమిషనర్‌కు వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలోని హాజీపూర ప్రాంతంలో జాతీయ రహదారి అబ్దుల్ కలాం రోడ్డు మలుపు వద్ద డివైడర్లను తొలగించాలని స్థానిక ప్రజలు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. హైవేపై దూరంగా మలుపు ఉండటంతో ప్రజలు రాంగ్ సైడ్ వెళ్లడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, లబ్దుల్ కలాం రోడ్ మలుపు వద్ద డివైడర్ తొలగించి దారి ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ వాసిద్, అబ్దుల్ ముస్విత్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


కిచెన్ షెడ్‌కు భూమిపూజ చేస్తున్న అధికారులు

వెల్గటూర్: గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక అన్నారు. శుక్రవారం వెల్గటూర్ మండలంలో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృపాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి


పోస్టుకార్డులు పంపుతున్న ఉద్యమకారులు

జగిత్యాల: ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని, కాంగ్రెస్ ఇచ్చిన మాట నెరవేర్చితే చరిత్రలో నిలిచిపోతారని జగిత్యాల ఉద్యమకారుల చైర్మన్ జువ్వాజి శంకర్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీకి పోస్టు కార్డులు పంపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చింది అందరికీ తెలుసునని, ఉద్యమకారుల హామీలు సైతం నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాగుల రాజు, సత్యంరావు, ఉమేందర్, ప్రేమ్‌కుమార్, తిరుపతి, విజయ, మణెమ్మ పాల్గొన్నారు.